క్లుప్తంగా

వేల్పూరు నివాసి నేత్ర దానం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామవాసి ఓబూరి రామాంజనేయులు (55) అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యుల అనుమతితో రెండు నేత్రాలను శంకర కంటి వైద్యశాలకు దానం చేసినట్లు అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటరు సంద్రపాటి చలపతిరావు ఆదివారం తెలిపారు. అవయవ దానం వల్ల మరొకరికి ప్రాణం పోసినట్లు అవుతుందని పేర్కొన్నారు. చనిపోయిన వారంతా ఐదు గంటల సమయంలోపు నేత్రాలు దానం చేయటానికి వీలవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఓబూరి మల్లికార్జునరావు, ఆదినారాయణ, నాగరత్నమ్మ, మంగమ్మ, నాగేశ్వరరావు, నాగజ్యోతి, అశోక్ చౌదరి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



చిలకలూరిపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మురికిపూడి జెడ్పీ హైస్కూలులో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయమ్మ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా మెలగాలని సూచించారు. అనారోగ్యం కలిగిన వెంటనే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. వైద్య శిబిరంలో డాక్టర్ సీహెచ్. రామకృష్ణ, డాక్టర్ ప్రత్తిపాటి ప్రఫుల్లాదేవి, డాక్టర్ మైథిలీ రాణి, డాక్టర్ అనితలు 200 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఒయాసిస్ సంస్థ సభ్యులు ఎండీ కరిమా, కరణం విజయలక్ష్మి, పి. సంధ్యారాణి, కందిమళ్ల నారాయణమూర్తి పాల్గొన్నారు.

'సంఘ స్వరం' ఆధ్యాత్మిక మాస పత్రిక ఆవిష్కరణ



సత్తెనపల్లి: పట్టణంలోని బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో 'సంఘ స్వరం' అనే సంఘ సమాచార, ఆధ్యాత్మిక మాస పత్రికను దైవజనులు రెవ. జరుగుమల్లి ఇశ్రాయేలు ఆదివారం చర్చి ఆవరణలో ఆవిష్కరించారు. ప్రతి నెల విడుదల కానున్న ఈ పత్రికను క్రమం తప్పక సంఘస్తులు చదవాలన్నారు. క్రియారూపక విశ్వాసంలో మరింత స్థిరపడడానికి దోహదం చేస్తుందన్నారు. బాప్టిస్టు సంఘాల గురించి తెలుసుకోవచ్చన్నారు. అనంతరం సంఘ సభ్యుడు, ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయుడు గర్నెపూడి సాల్మన్‌రాజును కార్యవర్గం సత్కరించింది. ఆయా కార్యక్రమాల్లో సంఘ కార్యదర్శి కె.ఎం.ఆనిరాజ్, సంయుక్త కార్యదర్శి బంకా కిషోర్‌బాబు, కోశాధికారి రవిరాజు, ఉపకోశాధికారి వందన్ కుమార్, కార్యవర్గ సభ్యులు గంగవరపు ప్రసాద్, రాచపూడి జయపాల్, దంతం కుమార్, ఆనందరావు, రాజరత్నం ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



నకరికల్లు: కర్బలా మైదానంలో ధర్మ యుద్ధం చేస్తూ ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలకు గుర్తుగా మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో మొహర్రంను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని పీర్ల చావిడి వద్ద నుంచి పీర్లను ఘనంగా ఊరేగించారు. పెద్ద సంఖ్యలో కులమతాలకు అతీతంగా ప్రజలు ఊరేగింపులో పాల్గొన్నారు. అమరుల త్యాగాలను గుర్తు చేస్తూ మాతంపాడారు. ఊరేగింపుతో గ్రామ ప్రధాన వీధులన్నీ కిటకిటలాడాయి. యా...హుస్సేన్..యా...హుస్సేన్ అంటూ నినాదాలు, అమరవీరుల నామస్మరణతో వీధులన్నీ మారుమోగాయి. పురవీధుల్లోకి పీర్లురాగా భక్తులు వార్లు పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. మృతవీరుల గుర్తుగా ఊరేగించిన పీర్లను సంప్రదాయబద్ధంగా నిమజ్జనం చేశారు. ఊరేగింపులో అవాంఛనీయ ఘటనలు జరగకుండా సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ ఆధ్వర్యంలో ఎస్ఐ చల్లా సురేష్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

ముప్పాళ్ళలో మొహర్రం

ముప్పాళ్ళ: ముస్లిం వీరుల త్యాగాలకు గుర్తుగా నిర్వహించే మొహర్రం పండుగను మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ముస్లిం వీరులకు గుర్తుగా పీర్లను అందంగా అలంకరించి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, గోళ్ళపాడు, తొండపి, లంకెలకూరపాడు గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా తొలిఏకాదశి వేడుకలు



ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న భక్తులు

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం తొలి ఏకాదశి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. సత్రశాల వద్ద నున్న అతి పురాతనమైన శైవక్షేత్రమైన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ధ్వజ స్తంభం వద్ద, ఉప ఆలయాలలో ప్రత్యేక పూజలు, స్పటిక లింగం వద్ద అభిషేకాలు చేపట్టారు. ఆర్య వైశ్య అన్నదాన సంత్రంలో ఆంజనేయులు నేతృత్వంలో 18 మంది దంపతులు పీటలపై కూర్చుని సత్యనారాయణ వ్రతం చేశారు. అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. అభిషేకాలు, శీఘ్రదర్శనం, కానుకల ద్వారా మొత్తం రూ.23,916 ఆదాయం వచ్చినట్లు ఎండోమెంట్ ఈఓ గాదె రామిరెడ్డి తెలిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు వెన్నా వెంకటేశ్వరరెడ్డి దంపతులు, బరువు శివారెడ్డి దంపతులు ప్రసాదం పంపిణీ చేశారు. దేవస్థానం ఆవరణలో రెంటచింతల భక్తజన బృందం గీతా ప్రవచనం చేశారు.



ఉప్పలపాడు భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో పూజల దృశ్యం

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వెల్దుర్తి: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలలో ఆదివారం తొలిఏకాదశి పురస్కరించి శివ నామస్మరణతో మార్మోమోగాయి. మండలంలోని గొట్టిపాళ్లలోని మార్కండేయ స్వామి దేవాలయంలో అర్చకులు దిడుగు శంకరశర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శిరిగిరిపాడు శివాలయంలో యండపల్లి సుబ్బారావు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పలపాడులోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో మేడిపల్లి నరసింహ్మయ్య మూర్తి శర్మ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, పూజలు జరిగాయి. వెల్దుర్తి, గుండ్లపాడు, మందాది, పట్లవీడు, కండ్లకుంట గ్రామాలలోని శివాలయాలయాలలో తొలిఏకాదశి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వివిధ దేవాలయాలలో పులిహోర పంపిణీ చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే శివాలయాలకు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మాచవరం మండలంలో..

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వార్లను దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మోర్జంపాడులోని శ్రీబుగ్గమల్లేశ్వరస్వామి దేవాలయానికి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పూజారులు తొలి ఏకాదశి విశిష్టతను భక్తులకు వివరించారు. స్వామి వార్ల దర్శనంతో కలిగే పుణ్యఫలాలను భక్తులకు తెలియజేశారు. భక్తులు గుత్తికొండ బిలం, దైద, అమరావతి తదితర పుణ్యక్షేత్రాలకు తరలివెళ్లారు.

గంగమ్మ తల్లికి పూజలు

పిడుగురాళ్ల: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. అమ్మ వారిని ప్రత్యేక అలంకరించి, పూజలు చేపట్టారు. భక్తులు అమ్మ వారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.



దేవస్థానం ఆవరణలో స్పటికలింగం వద్ద అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

రోడ్లపై ఇలా!



మాచర్ల- గుంటూరు ప్రధాన రహదారి (తారురోడ్డు)పై దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్లు

తారు రోడ్లపై దమ్ము చక్రాలతో ట్రాక్టర్‌లు వెళ్తుండటం కారణంగా కొంత కాలానికే ఆ రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. దమ్ము చక్రాలతో ట్రాక్టర్లను తీసుకువెళ్లేవారు ఆ చక్రాలకు రబ్బరు తొడుగులను తొడగాల్సి ఉంది. స్థానిక అధికారులు చూసిచూడనట్లు వ్యవహరించడం వలన ఎలాంటి జంకు(భయం) లేకుండా దమ్ముచక్రాలకు తొడుగులు లేకుండా ట్రాక్టర్‌లను యథేచ్ఛగా తారు రోడ్లపైనే తీసుకెళ్తున్నారు. దీంతో రోడ్లపై పదుల సంఖ్యలో దమ్ము చక్రాలతో వెళ్తుండటం కారణంగా దమ్ము చక్రాల గాడులుపడి తక్కువ సమయంలోనే ధ్వంసమవుతోంది. - రెంటచింతల

యేచూరి సేవలు మరువలేనివి



గురజాల: సీనియర్ పాత్రికేయుడు, సీపీఐ నాయకుడు యేచూరి లక్ష్మీనారాయణ సేవలు మరువలేనివని నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడేజానీ అన్నారు. స్థానిక అనిగ్రేస్ వృద్ధాశ్రమంలో యేచూరి లక్ష్మీనారాయణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి యేచూరి శ్రీనివాసరావు, యేచూరి శివ, సీపీఐ నాయకుడు షేక్ హుస్సేన్, స్మైల్ ఫౌండేషన్ నిర్వహకుడు గుండా కాశీవిశ్వనాథం, కుటుంబ సభ్యులు యేచూరి మణిదీప్, ప్రదీప్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలు కొనసాగిద్దాం



బాబూ జగ్జీవన్‌రామ్ కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కిరణ్‌కుమార్

పిడుగురాళ్ల: బాబూ జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగించాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మాదాల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ సెంటర్‌లోని ఆయన కాంస్య విగ్రహం వద్ద మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ చల్లగుండ్ల స్వామి ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం అలుపెరగకుండా శ్రమించిన వ్యక్తి, భారత దేశపు మొదటి దళిత ఉప ప్రధాన మంత్రి బాబూ జగ్జీవన్‌రామ్ అన్నారు. దళితుల హక్కుల కోసం పోరాడి మహోన్నతమైన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో గురజాల నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ కొమెర వెంకటేశ్వర్లు, గురజాల నియోజకవర్గ మున్సిపల్ కన్వీనర్ జూలకంటి శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ కాలే మాణిక్యరావు, బీసీ సెల్ కన్వీనర్ కందులూరి శివయ్య, టౌన్ యూత్ అధ్యక్షులు మందా సుధీర్, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ చల్లగుండ్ల స్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు మందా ప్రేమ్‌రాజ్, జంగాల బాబు, మందా జాషువా, కత్తి చిన్న, కత్తి నిఖిల్, తాళ్లూరి సునీల్, నగర కంటి అవినాష్, పసుపులేటి ఆశోక్ , చంద్ నాయక్, మల్లవరపు శేఖర్, మల్లవరపు నాణి, మందా రాజేష్, చల్లగుండ్ల రమేష్, చల్లగుండ్ల సిద్దు, చల్లగుండ్ల మరియదాసు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కారెంపూడి మండల కార్యవర్గం



పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమితులైన సుబ్రహ్మణ్యం, వీరాంజనేయులు

కారెంపూడి: వైఎస్సార్ సీపీ కారెంపూడి మండల అధ్యక్షుడిగా కొంగర సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శిగా దొంతా వీరాంజనేయులు నియమితులయ్యారు. ఈ మేరకే వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షులుగా గురజాల రామారావు, వెన్నపూసల జగన్‌మోహన్‌రెడ్డి, కార్యదర్శులుగా చిరుమామిళ్ల నరసింహారావు, అలవాల రాజశేఖరరెడ్డి, వేంపాటి నాగిరెడ్డి, కొత్రపాటి ఆంజనేయులు, అదనపు కార్యదర్శులుగా పంగులూరి నరసింహారావు, యరసాని బుచ్చిరెడ్డి, బత్తుల బైరాగివర్మ, బుర్రి రామగురవయ్య నియమితులయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బత్తుల అనంత లక్ష్మయ్య, అల్లా శంకరరెడ్డి, పాలకీర్తి శ్రీను, కొలిమి శ్రీనివాసరావు, దిబ్బమడుగు వీరయ్య, పెళ్లూరి బిక్షం, కడియం వెంకటరావు, చేవూరి సుబ్బారావు, సూరె మోషయ్య, కడియం భూషణం, చిలుకూరి రవీంద్రారెడ్డి, గంటా కృష్ణ, బొంకూరి శంకర్, నల్లా రామాంజనేయులు, షేక్ బాషాలకు అవకాశం కల్పించారు. తనపై నమ్మకంతో రెండో సారి పార్టీ మండల అధ్యక్షునిగా నియమించేందుకు సిఫార్స్ చేసిన వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విజయపురిసౌత్ మాలమహానాడు అధ్యక్షునిగా రాయప్ప



విజయపురిసౌత్ మాల మహానాడు అధ్యక్షునిగా నియామక పత్రాన్ని అందుకుంటున్న కట్టారాయప్ప

విజయపురిసౌత్: మాలమహానాడు మాచర్ల మండలం విజయపురిసౌత్ అధ్యక్షునిగా కట్టరాయప్పను నియామకం చేసినట్లు నియోజకవర్గ మాల మహానాడు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చింతమళ్ళ శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఫిల్టర్ హౌస్ ఏరియాలో పలువురు మాల సంఘం పెద్దల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి కట్టా రాయప్పను అధ్యక్షునిగా, ఉపాధ్యక్షునిగా చింతమళ్ల చెన్నకేశవరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాలమహానాడు సంఘం నాయకులు పగిడిపల్లి విజయ్, తాడిమల్ల రాహుల్, రుద్రపాటి ధనుంజయ్, పత్తి రామచందర్, బుట్టి అక్కయ్య, జక్కి ప్రేమ్ కుమార్, చింతమళ్ల యాకోబు, బండి వెంకటేశ్వర్లు, గొర్రె ముచ్చు ఆంజనేయులు, దార్ల రంజిత్ కుమార్, అందే రాంబాబు, కొండ కోటయ్య, మద్దు ముక్కంటి, పత్తి డిల్లీ, దాసరి కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

రూ.5.83 కోట్లతో నూతన భవనాలకు భూమి పూజ



ఏపీఆర్ జూనియర్ కళాశాలలో నూతన భవన నిర్మాణాలకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

విజయపురిసౌత్: స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాలలో రూ.5.83 కోట్లతో నూతనంగా నిర్మించే భవనాలకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో గొప్ప చరిత్ర కలిగిన నాగార్జునుడు నడయాడిన ఈ ప్రదేశంలో ఏపీఆర్జేసీ కళాశాల ఎంతో ప్రతిష్టాత్మకమైంది అన్నారు. 50 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్న ఈ కళాశాలకు మళ్లీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. అధ్యాపకులు తమ వృత్తిని ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కళాశాల నుంచి పలువురు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ స్థాయి అధికారులను నిష్ణాతులైన డాక్టర్లను, సీఏలను దేశానికి అందించిందని కొనియాడారు. ఇక్కడ చదివిన విద్యార్థులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి తమ తమ వృత్తులలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. గోల్డెన్ జూబ్లీ సెలబ్రేషన్లు డిసెంబర్ 13, 14 నిర్వహించే కార్యక్రమానికి ఈ నిర్మాణాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్.రాజశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ సరోజిని, గోల్డెన్ జూబ్లీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ ఏ సైదారెడ్డి, ఏపీ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ రిటైర్డ్ ఆర్అండ్‌బీ డాక్టర్ కె.వెంకటేశం, తాడికొండ గురుకుల అల్యూమ్నీ ప్రెసిడెంట్ ఎ.వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంఘం జాయింట్ సెక్రటరి రమేష్‌నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ పాల్గొన్నారు.

వాహనం.. ఆదమరిస్తే మాయం !

- పల్నాడు జిల్లాలో నిత్యం ద్విచక్ర వాహన చోరీలు
- పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని దొంగతనాలు
- నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతున్న యజమానులు

బండికి హ్యాండిల్ లాక్ వేశాం.. ఒకటికి రెండుసార్లు మరీ చెక్ చేసుకున్నాం. హమ్మయ్యా..ఇక సేఫ్ అనుకుంటూ హోటల్లోకి వెళ్లి టిఫిన్ చేసి బయటకు వచ్చాం.. చేతిలో తాళం చేతిలోనే ఉంది.. బండి మాత్రం మాయమైంది. ఇది పల్నాడు జిల్లాలో నిత్యం బైక్ దొంగతనాల వరుస.



నరసరావుపేట టౌన్ : పల్నాడు జిల్లాలో ద్విచక్ర వాహనదారుల దొంగలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. పార్క్ చేసిన వాహనాలను లక్ష్యంగా చేసుకొని చెలరేగిపోతున్నారు. ఇంటి ముందు, గేటు బయట, రోడ్డుపక్కన నిలిపిన వాహనాలకు భద్రత కరువవుతోంది. నిమిషాల వ్యవధిలో కనిపించకుండా పోతున్నాయి. జాగ్రత్తలు తీసుకున్నా దొంగలు హస్త లాఘవం ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఇంటి ఎదుట నిలిపిన బైకులే ఎక్కువగా మాయమవుతున్నాయి. ఇటీవల జరిగిన పలు ఘటనలు వాహన యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. సమీపంలోని సీసీ కెమెరాలో పరిశీలించగా అగంతకులు బైక్ తీసుకెళ్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. కానీ నిందితుడిని గుర్తించి, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. జిల్లాలో ఇప్పటి వరకు వందల సంఖ్యలో వాహనాలు అపహరణకు గురయ్యాయి.

సవాల్‌గా మారిన దొంగతనాలు

కొన్ని స్టేషన్లలో పట్టణంలోని రహదారులు, కాలనీలు, అపార్ట్‌మెంట్ల చుట్టూ సీసీ కెమెరాలు లేకపోవడం కూడా దొంగతనాలకు కారణంగా ఉంది. గస్తీ పోలీసులు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, చోరీల రేటు తగ్గకపోవడం గమనార్హం. దొంగతనం చేసిన ద్విచక్ర వాహనాలను నంబర్ ప్లేటు మార్చి చోరులు విక్రయిస్తున్నారు. నరసరావుపేటకు చెందిన ఓ ముఠా చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాలకు వెళ్లి దొంగతనాలు చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఇటీవల చిలకలూరిపేటలో జరిగిన బైక్ చోరీల్లో నరసరావుపేటకు చెందిన కొందరు యువకులు అనుమానితులుగా ఉండటంతో వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నాదెండ్ల మండల సాతులూరులో రెండు నెలల వ్యవధిలో ఏడు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురి కావడం గమనార్హం. అక్కడ బ్యాంకులోకి వెళ్లి పని చూసుకొని బయటకు వచ్చేలోగా వాహనం మాయం కావడం చోరీల తీవ్రతను తెలుపుతోంది.



ఇటీవల చిలకలూరిపేటలో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

అధికారులు ద్విచక్ర వాహన చోరీకి సంబంధించి కేసులే నమోదు చేయడం లేదు. దీంతో బాధితులు ప్రతి సోమవారం నిర్వహించే స్పందనకు వచ్చి తమ గోడును అధికారులకు వెళ్లబోసుకుంటున్నారు.

పెండింగ్‌లో అనేక కేసులు

గత పది నెలల్లో పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, చిలకలూరిపేట, పిడుగురాళ్ల, మాచర్ల, వినుకొండ పట్టణాల్లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహన దొంగతనాలకు సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఇక వాహనం చోరీ జరిగినప్పటికీ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయని వారు అనేక మంది ఉన్నారు. చెడు వ్యసనాలకు బానిసై కొంతమంది యువత ద్విచక్ర వాహనాలను చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. నరసరావుపేట పట్టణంలోని వన్ టౌన్, టూ టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎ 30కి పైగా ద్విచక్ర వాహన చోరీ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికే కొన్ని కేసుల్లో రికవరీ చేసి యజమానులకు వాహనాలు అప్పగించగా, మరి కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. సీసీ ఫుటేజ్‌లో నిందితుడి ఆనవాళ్లు స్పష్టంగా కనపడక పోవడం పోలీసులకు సమస్యగా మారింది. చోరీ జరిగిన ప్రాంతాల్లో ఎటువంటి క్లూ లభ్యం కాకపోవడంతో కేసుల్లో పురోగతి లభించడం లేదని పోలీసులు చెబుతున్నారు.

నివారణకు చర్యలు



డివిజన్ పరిధిలో ద్విచక్ర వాహన దొంగతనాలకు సంబంధించి 80 శాతం కేసుల్లో నిందితుల్ని అరెస్ట్ చేశాం. వాహనాలను రికవరీ చేసి యజమానులకు అప్పగించాం. పార్క్ చేసే సమయంలోనే యజమానులు అప్రమత్తంగా ఉండాలి. సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నచోట్ల నిలుపుకుంటే మంచిది.

– కె.నాగేశ్వరరావు, డీఎస్పీ

వ్యక్తిపై దాడి

మాచవరం: మండల కేంద్రమైన మాచవరం ఎస్సీ కాలనీలో వ్యక్తి దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన సేదల సాగర్‌పై అదే కాలనీ చెందిన జార్జితో పాటు మరో ఇద్దరు ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఘటనలో సాగర్‌కు తల నుదుటి భాగం, ముఖంపై గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం పిడుగురాళ్ల ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ముగ్గురుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సీతమ్మతల్లికి ఆషాఢ సారె సమర్పణ

నాదెండ్ల: తొలి ఏకాదశిని పురస్కరించుకుని గణపవరం కోదండ రామాలయంలో సీతమ్మ తల్లికి ఆషాఢ మాస సారె సమర్పించారు. తొలుత అమ్మవారి ప్రతిమతో పాటు సారె, పసుపు కుంకుములు, గాజులతో ఆలయం నుంచి ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90100 01840 (పిడుగురాళ్ళ, మాచర్ల)
Office mail : sakshigntadvt@gmail.com